క్లుప్తంగా

రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులు



సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి, పరిసర కాలనీల్లో రూ.1 కోటి 15 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత అగనంపూడి, షిర్డీ సాయి నగర్, గళ్లవానిపాలెం ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, కార్పొరేటర్ ఆర్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరానికి హాజరైన రోగులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పెదపాలెం గ్రామంలో అపోలో హాస్పిటల్స్, సహాయత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌నకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి హాజరైన ప్రజలకు అపోలో హాస్పిటల్స్ వైద్యులు సాధారణ వైద్య పరీక్షలతో పాటు డెంటల్, కంటికి సంబంధించిన పరీక్షలు చేశారు. గ్రామంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి ఆలయ ముఖద్వార ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వారాల ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయమన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, పెంటకోట నాగేశ్వరరావు, పెంటకోట శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆ‘నంద నందనుడు’.. అడుగిడిన వేళ..



కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు



అరబిందో పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

నంద నందనుడి పుట్టినరోజు వేడుక ప్రతీ ఇంటా పండగ తెచ్చింది. యశోదాదేవి గారాల పట్టీ .. చిన్ని కృష్ణయ్య నడయాడినట్లుగా తీర్చిదిద్దిన పాదముద్రలతో లోగిళ్లు బృందావనాలే అయ్యాయి. బాల గోపాలుడు .. బుల్లి గోపికల వేషధారణల్లో చిన్నారులు చూడముచ్చటగా కనిపించారు. వారి ఆటపాటలతో, ఉట్టి సంబరాలతో కృష్ణాష్టమి కనులపండువగా జరిగింది.

- బృందావనాలుగా మారిన లోగిళ్లు
- వేడుకగా శ్రీ కృష్ణాష్టమి

పెదగంట్యాడ: కృష్ణాష్టమి వేళ గాజువాక గోకులమే అయింది. వుడా కాలనీ వినాయకనగర్‌లోని వుడా ఓపెన్ ఆడిటోరియంలో ప్రబోధ సేవా- ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఉట్టి సంబరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. 11న తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 7 గంటలకు, సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పూజలు, భగవద్గీత శ్లోకాల పఠనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత తదితరులు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెంలో చిన్ని కృష్ణుడిగా మైరా శివాని

కృష్ణ మందిరంలో..

గాజువాక: మెయిన్ రోడ్‌లోని వేణుగోపాల స్వామి ఆలయం (శ్రీకృష్ణ మందిరం)లో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉరుకూటి అప్పారావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రియదర్శిని స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి



కృష్ణమందిరంలో స్వామిని దర్శించుకుంటున్న మంత్రి అమర్‌నాథ్



శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు



చలపతిలో చిన్నారుల ఉట్టి సంబరం

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాట



మాట్లాడుతున్న లావు రత్తయ్య

అగనంపూడి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల కళాశాలపై పెట్టుకున్న నమ్మకం, విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సీఈవో శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

వైవీ సుబ్బారెడ్డికి ఆర్పీల వినతి



సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

అక్కిరెడ్డిపాలెం: డ్వాక్రా సంఘాల రిసోర్స్ పర్సన్లు తమ సమస్యలను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. నగరంలో బుధవారం ఆయన్ను కలిసిన వారు, వినతిపత్రం అందజేశారు. తమకు గౌరవ వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి వేతనాలు ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవాలని, హెచ్‌ఆర్ పాలసీలు కల్పించాలని కోరారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో జీవీఎంసీ యూసీడీ పీడీ బాపినాయుడు, ఆర్‌పీల అధ్యక్షురాలు అలివేణి, కార్యదర్శి అమ్మాజీ, గాజువాక ఓబీ గొంతిన సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గణపతి కోటి నామాల పుస్తకాల పంపిణీ

గాజువాక: పాతగాజువాక లంకా మైదానంలో ఏర్పాటు చేస్తున్న భారీ గణపతి మండపం వద్ద ఉత్సవ నిర్వాహకులు గణపతి కోటి నామాల పుస్తకాలను పంపిణీ చేశారు. నిర్వాహకుడు గణేష్ మాట్లాడుతూ భక్తులు స్వీకరించిన పుస్తకాలలో గణపతి కోటి నామాలను రాసి, తమకు అందజేయాలని కోరారు. వాటిని కాణిపాకం గణపతి ఆలయంలో ఉంచుతామని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 21 రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తామని, ఆ సమయంలో తమకు పుస్తకాలను అందజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొసిరెడ్డి లక్ష్మి, పండిత్ హరీష్, నిర్మల, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

‘తానా’ కవి సమ్మేళనానికి వరలక్ష్మికి ఆహ్వానం



అగనంపూడి: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న కవి సమ్మేళనానికి రచయిత్రి, ఉపాధ్యాయిని నల్లా నాగ సూర్య వరలక్ష్మికి ఆహ్వానం అందింది. ఆంగ్ల ఉపాధ్యాయినిగా పని చేస్తున్న వరలక్ష్మి తెలుగు సాహిత్యంపై మక్కువతో అనేక రచనలు చేస్తున్నారు. గత జూన్‌లో నిర్వహించిన తానా సభల్లో పాల్గొన్న ఆమె తెలుగు భాషాభివృద్ధి కోసం చేస్తున్న కృషిని గుర్తించి, అంతర్జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు ఆహ్వానం పంపినట్టు ఆమె తెలిపారు. కవి సమ్మేళన కార్యక్రమం తానా అధికారిక యూ ట్యూబ్, ఫేస్‌బుక్‌లలో ప్రసారం కానున్నాయని తెలియజేశారు.

స్ఫూర్తి ప్రదాత సర్వేపల్లి

గాజువాక: ఉపాధ్యాయులందరూ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. గాజువాకలోని ఓ హోటల్‌లో గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన జోనల్ కమిషనర్ పి.సింహాచలం మాట్లాడుతూ ఒక దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మాణం జరుగుతుందని సర్వేపల్లి తెలిపిన విషయాన్ని ఉపాధ్యాయులంతా గుర్తించి, తమ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో అంకితభావంతో సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గాజువాక ఎంఈవో ఎం.సునీత, జిప్సా ప్రతినిధులు పి.భాస్కరరావు, బి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

రేపు ఉచిత సామూహిక శ్రావణలక్ష్మీ పూజలు

డాబాగార్డెన్స్ : శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దేవస్థానంలో నెల రోజుల పాటు శ్రావణలక్ష్మి పూజలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 8న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు కనకమహాలక్ష్మీ దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పూరించి గురువారంలోగా అందజేయాలి.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091 లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.



పూజలు చేస్తున్న భక్తులు

21వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు..

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు బుధవారం 21వ రోజుకి చేరాయి. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



కచేరీ నిర్వహిస్తున్న శారదా సుబ్రహ్మణ్యం

వెండి కిరీటాలు, ఆభరణాల బహూకరణ

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పాపయ్యరాజుపాలెం ఆర్టీసీ లేఅవుట్‌లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దాతలు సమకూర్చిన వెండి కిరీటాలు, ఆభరణాలను బుధవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతులమీదుగా అందజేశారు. పాపయ్యరాజుపాలేనికి చెందిన దాతలు జి.సంగమేశ్వరరావు, రామారావు, దూర్వాసులు, రవి ప్రసాద్, కృష్ణారావు, శేఖర్, నాగమణి, మోహనరావు, రామ ప్రసాద్ రూ. లక్షతో స్వామికి వెండి కిరీటాలు, ఆభరణాలు చేయించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వాటిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, కె.సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు కేవీఆర్.లక్ష్మి, భీమారావు, రామసూరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెండి కిరీటాలు, ఆభరణాలు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

ఆయుష్ గణపతిగా..

గ్లోబెక్స్ వద్ద కొలువుదీరనున్న పార్వతీ నందనుడు

అక్కిరెడ్డిపాలెం: గ్లోబెక్స్ వద్ద గల సీఎంఆర్ మైదానంలో కొలువుదీరనున్న గణనాథుడు ఆయుష్ గణపతిగా పూజలందుకోనున్నారు. ఇందుకోసం 109 రకాల వనమూలికలు, ఔషధ గుణాలు కలిగిన ఆకులు, పుట్టమట్టి, చంపావతీ తీరంలో ఉన్న మట్టిని విగ్రహ తయారీలో వినియోగించనున్నట్లు శ్రీ మహాగణపతి యువజన సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న ప్రాంతంలో ధన్వంతరి సహస్రాయు పీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ జి.రవివర్మ, సిద్ధ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ టి.రామునాయుడు, ఆయుష్ ఫౌండేషన్ అండ్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ ప్రాక్టీషనర్ బి.త్రిమూర్తులు, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి తదితరులు గణపతికి ఆయుష్ గణపతిగా నామకరణం చేశారు. వినాయకచవితి పూజలో వినియోగించే 21 రకాల ఔషధ పత్రాలను, మొక్కలను ప్రదర్శనగా ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వాటి ప్రాధాన్యాన్ని కూడా ప్రదర్శనలో తెలియజేస్తామన్నారు.



విగ్రహం తయారీకి 109 రకాల వనమూలికలు, పత్రాలు, మట్టిని సమర్పిస్తున్న ప్రముఖులు

సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయం

- బదిలీపై వెళ్తున్న ఐలా కమిషనర్‌కు వీడ్కోలు
- కొత్త కమిషనర్ జయచంద్రకు సాదర స్వాగతం

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఐలా కమిషనర్‌గా కె.సూర్యనారాయణ అందించిన సేవలు ఎనలేనివని ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు) కొనియాడారు. బదిలీపై అమరావతి వెళ్తున్న ఆయన్ను ఆటోనగర్ ఐలా భవనంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఐలా ప్రతినిధులు మాట్లాడుతూ సూర్యనారాయణ పారిశ్రామిక వేత్తలకు స్నేహపూర్వక వాతావరణంలో సహకారం అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌కు ఆహ్వానం

ఐలా నూతన కమిషనర్‌గా నియమితులైన జయచంద్రకు ఐలా ప్రతినిధులు సాదరంగా స్వాగతం పలికారు. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కొంతకాలం ఆటోనగర్ ఐలా కమిషనర్‌గా సేవలందించిన జయచంద్ర మళ్లీ నియమితులు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) అధ్యక్షుడు ఎస్.పాండురంగ ప్రసాద్, లఘు ఉద్యోగ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఐలా సంయుక్త కార్యదర్శి రామకృష్ణంరాజు, పెదగంట్యాడ ఐలా అధ్యక్షుడు సత్యనారాయణ, ఐలా కోశాధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ఐలా పూర్వ, నూతన కమిషనర్లను సన్మానిస్తున్న ఆటోనగర్ ఐలా ప్రతినిధులు

ప్రజా భాగస్వామ్యంతోనే ‘ఉక్కు’ పరిరక్షణ

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే కార్మికులు తీవ్రస్థాయిలో నష్టపోతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలని, ప్రజా భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 937వ రోజు బుధవారం సంస్థలోని ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొని, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, ప్లాంట్‌కు భూములు ఇచ్చిన నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దేశ ప్రజలందరూ ఐక్యంగా అడ్డుకోవాలని కోరారు. కార్మికుల హక్కులు కాపాడాలన్నా, భూ నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే కొనసాగే విధంగా ప్రజలతో కలిసి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



937వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

బ్లాస్ట్ ఫర్నేస్-3లో ఉత్పత్తి ప్రారంభించాలి

ఉక్కునగరం: బ్లాస్ట్‌ఫర్నేస్-3లో ఉత్పత్తి సత్వరం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎస్.వి. స్వామిని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. సీజీఎంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు ఆయన్ను బుధవారం కలిసి, అభినందించారు. వారు మాట్లాడుతూ నూతన సీజీఎం నేతృత్వంలో ప్లాంట్ పూర్తి స్థాయిలో నడిచేలా సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. సీజీఎం స్వామి మాట్లాడుతూ ఈ ఏడాది కచ్చితంగా నెట్ ప్రాఫిట్ వస్తుందన్నారు. ప్లాంట్‌లో చిన్న చిన్న సమస్యలు ఉన్నా ప్లాంట్‌ను ముందుకు తీసుకు వెళ్లడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, బీఎంకె నాయక్, రమణమూర్తి, ఎస్.ఎ. నాయుడు, నారాయణరావు, మింది దేముడు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ నూతన సీజీఎం స్వామిని సత్కరిస్తున్న నాయకులు

ఫణీంద్రను తల్లికి అప్పగించిన రెడ్‌క్రాస్ సొసైటీ

ఎంవీపీకాలనీ : పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన ఫణీంద్ర (22) అనే యువకుడిని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు త్రీటౌన్ పోలీసుల సమక్షంలో అతని తల్లి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. బీటెక్ చదువుతున్న ఫణీంద్రను తల్లి కళాశాలకు సరిగ్గా వెళ్లడం లేదని మందలించింది. దీంతో కోపానికి గురైన అతను ఇంట్లో నుంచి పారిపోయి వచ్చి విశాఖ చేరుకున్నాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి నైట్ పెట్రోలింగ్ చేస్తున్న త్రీటౌన్ ఎస్‌ఐ రాముతో పాటు సిబ్బందికి బీచ్‌రోడ్డులో కనిపించాడు. వివరాలు అడగ్గా సరైన సమాధానం ఇవ్వలేదు. ఎద్దైనా అఘాయిత్యం చేసుకుంటాడనే అనుమానంతో పోలీసులు ఫణీంద్రను త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి అనంతరం పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు అప్పగించారు. అతన్నుంచి వివరాలు సేకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అతని తల్లి మల్లేశ్వరితో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో బుధవారం అతన్ని తల్లి మల్లేశ్వరికి అప్పగించారు.



ఫణీంద్రను తల్లి మల్లేశ్వరికి అప్పగిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

వీనులవిందుగా గాత్ర కచేరీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటకోత్సవాల 5వ రోజు శారదా సుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, శారదా సుబ్రహ్మణ్యం గుమ్ములూరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేశారు. వయొలిన్‌పై మావుడూరి శర్మ, మృదంగంపై జయ భాస్కర్, ఘటంపై ఎం.సూర్యప్రసాద్ సహకారం అందించారు.